# రైలాగని స్టేషను



వేసంగి వెచ్చగా వచ్చింది. పాఠశాలలు మూశారు. పట్నంలో, హాస్టల్లో ఉండి చదువుతున్న మనవణ్ణి వెంట బెట్టుకుని తాతయ్య స్వంత గ్రామానికి బయలుదేరాడు.

"తాతయ్యా, తాతయ్యా! రైలు మన ఊళ్ళో ఆగకుండా వెళ్ళిపోతూందేమిటి?"

"... ..."

"చూడు, చూడు. అదిగో, గుడి గోపురం. దాని పక్కను మన మామిడి తోట. ఇంత చక్కా కనిపిస్తూంటేనూ — అన్నీ దాటుకు పోతున్నాం. ఏమిటి, తాతయ్యా, ఇది మెయిలా?"

"కాదు."

"కాకపోతే పాసెంజర్ ఎందు కాగకుండా వెళుతూంది?"

"ఇకమీదట మన ఊళ్లో రైలాగదు, నాయనా. స్టేషను తగలడిపోయింది కదా? మొండి గోడలు మిగిలాయి. ఇక దాని గతి అంతే! పై స్టేషనులో దిగి అక్కణ్ణించి మన ఊరికి బస్సులోనో, బండిలోనో అవస్థపడుతూ వెనక్కి ప్రయాణం చెయ్యమని మనకు శిక్ష విధించారు. మన ఖర్మ ఇలా కాలింది."

"మన స్టేషనులో ఎప్పటి లాగ రైలాగి ఉంటే ఈ పాటికి అమ్మ కలిపి పెట్టిన అన్నం తినేసి ఉండేవాణ్ణి. ఆకలేస్తూంది. ఎప్పటి కెళతామో ఏమో? స్టేషను తగలడిపోతే మళ్ళీ కట్టుకోకూడదా ఏమిటి, తాతయ్యా?"

"కట్టుకోవచ్చు, నాయనా. ఎందుకు కట్టుకోకూడదు? కాని, కట్టరు. కట్ట కూడదు. మన ఊరి కింక స్టేషను లేదు" అంటూ తాతయ్య ఎంతో బాధ పడ్డాడు.

• • •

దేశంలో ఎక్కడ చూసినా అలజడి, సమ్మెలు, నిరహార దీక్షలు. రైళ్ళు ఆపివేయడం, పట్టాలు పీకివేయడం, స్టేషన్లు తగలెట్టడం. వాటి వెనక కాల్పులు, మరణాలు. అంతా బీభత్సం.

'డాక్టర్స్ ఆర్ ఏంజెల్స్' అన్నారు. కాదు, మేం రాక్షసులమని సమ్మెలో పాల్గొన్నారు. ఆసుపత్రుల్లో డాక్టర్లు లేరు. రోగుల సంఖ్య ఎప్పటికప్పుడు పెరుగుతూ వచ్చింది. వాళ్ళని చూసే దిక్కు లేకపోయింది. డాక్టర్లకోసం ఆశగా ఎదురుచూస్తూనే ఎంతో మంది ప్రాణాలు వదిలారు. కాల్పుల్లో చచ్చిన వాళ్ళు చావగా, కొన ఊపిరితో 'ఇప్పుడా, అప్పుడా?' అంటూ వచ్చిన వారు కుప్పలుగా ఉన్నారు. వారిని బ్రతికించడానికి ఆసుపత్రుల్లో డాక్టర్లుంటేగా? ఉద్యోగ ధర్మాన్ని పాటిస్తున్న ఆ కొద్ది

మంది డాక్టర్లని సమ్మెలో చేరలేదన్న కసి కొద్దీ కాపలా కాసి కొట్టారు.

• • •

బెదిరింపుల్ని లెక్కచేయకుండా ఆ చిన్న ఊరి స్టేషను మాస్టరు శంకర్రావు తన ఉద్యోగ ధర్మాన్ని పాటిస్తూ ధైర్యంగా నిలబడ్డాడు. స్టేషనుకు తాళాలు వేయమన్నారు. లేకపోతే కొడతామన్నారు. పొడుస్తామన్నారు. ఇంటికి నిప్పెడతామన్నారు. శంకర్రావు భయపడలేదు. రైళ్ళ రాకపోకలు నిర్విఘ్నంగా జరిపించాడు. ఈ మొండి ఘటానికి పాఠం నేర్పాలంది ఆ ఊరి వెర్రి ప్రజ!

చిన్న మాస్టార్ని చలమయ్య ఆ రాత్రి డ్యూటీ కొస్తూంటే దారిలో నిలేశారు. ఇంటికి తిరిగి పొమ్మన్నారు. చలమయ్య పోనన్నాడు. స్టేషను వైపు దౌడు తీశాడు. వెంటబడ్డారు జనం. ఆ జుట్టు లేని నెత్తిమీద ఒక కర్ర దెబ్బ బలంగా తగిలింది. రక్తం చిమ్మింది. చలమయ్య ప్లాటు ఫారమ్ మీద పడిపోయాడు. ఆ ఊళ్ళో డాక్టరు లేడు. తొందరలో వచ్చే రైలుగాని, వెళ్ళే రైలుగాని లేదు. శంకర్రావుకి సమస్య అంతుపోయింది. పక్క స్టేషనుకి ఫోన్ చేశాడు. పది గంటలకొచ్చే పాసెంజరులో డాక్టర్ని పంపమని

## కె. ఎన్. రావు

ప్రాధేయపడ్డాడు. పంపుతున్నామని అటునుంచి వచ్చిన వార్త చెవిలో పడిన తరవాత శంకర్రావు ముఖం కాస్త తేటపడింది.

శంకర్రావు చూపులు గడియారం మీదే ఉన్నాయి. చిన్న ముల్లు పదికి దగ్గరవుతూన్న కొద్దీ ఆతనిలో ఆత్రత హెచ్చవుతూ వచ్చింది. పాసెంజరు అవతల స్టేషను వదలడానికి సిద్ధంగా ఉంది. లైన్ క్లియర్ ఇస్తే పాసెంజరు డాక్టరుతో సహా వచ్చి స్టేషనులో తనముందు హాజరవుతుంది. ఉన్నట్టుండి పెద్ద వెలుతురు కిటికీలోంచి దూసుకొస్తుంది. శంకర్రావు కళ్ళు జిగేల్ మన్నాయి. మామూలు ధోరణిలో ఏదో అనుకున్నాడు గాని, పెట్రోలు పోసి నిప్పంటించిన తన స్టేషను తగలడుతూందనుకోలేదు. కొద్ది క్షణాల్లో నాలుగు పక్కలా మంటలు లేచాయి. పోర్టరు—"బాబుగారో! బయటి కొచ్చేయండి" అంటూ పైకి లేస్తున్న మంటల కవతలనుండి పెద్ద కేక పెట్టాడు. డ్యూటీలో నిమగ్నుడై ఉన్న శంకర్రావుకు ఈ మంటలూ కనిపించలేదు, పోర్టరు పెట్టిన కేకా వినిపించలేదు. పోర్టరు ఆలోచనలో పడ్డాడు. 'చిన్న మాస్టారు చావు బ్రతుకుల్లో ఉన్నారు. పెద్దాయన మంటల్లో కలిసి పోయేటట్లున్నారు. స్టేషను దేవుడు లేని గుడి తీరవుతుంది కాబోలు' అనుకుని ఒక్క ఉరుకులో మంటల్ని దూకి 'లైన్ క్లియర్' అప్పుడే ఇచ్చి అవతలి స్టేషనుకి వార్త పంపుతున్న శంకర్రావుని చేరుకున్నాడు. గట్టిగా వాటేసుకుని శంకర్రావుని బయటకు తీసుకొచ్చాడు. అదే క్షణంలో కాలిపోయిన కొప్పు కూలి క్రింద పడింది. పెద్ద మాస్టారు బ్రతికి బయట పడ్డాడు.

వచ్చిన పాసెంజరు బండి అవుటర్ దగ్గర నిలబడిపోయింది. ముందుకు రావడానికి పట్టాల్లేవు. పాసెంజరులో వస్తాడని ఎదురు చూసిన డాక్టరూ రాలేదు. చివరకు చలమయ్య దారిని చలమయ్యా వెళ్ళిపోయాడు.

చిన్న మాస్టార్ని కొట్టారని తెలియగానే శంకర్రావు భార్య తలుపు దగ్గర కేసి హడావిడిగా అప్పుడే వెళ్ళింది. శంకర్రావు కూతురు సరోజ — ఏడేళ్ళ అమ్మాయి—గదిలో చదువుకుంటూ ఉంది. కిటికీ లోంచి దగ్గరంగా మంటలు కనిపించాయి. స్టేషను తగలడుతూందంటూ అవతల ఎవరో పరుగెత్తుకుంటూ వెళ్ళారు. సరోజ భయపడిపోయి 'అమ్మా' అని ఒక పెద్ద కేకేసింది. ఇంట్లో అమ్మ లేదు. గజగజ వణికిపోయింది. దుప్పటి ముసుగు పెట్టుకుని ఏడుస్తూ పడుకుంది: ఏడ్చి ఏడ్చి నిద్రపోయింది.

కొద్ది క్షణాల్లో శంకర్రావు ఇంటికీ నిప్పంటుకుంది. నిమిషాల్లో పెద్ద మాస్టారి ఇల్లు తగిలడుతూందన్న వార్త ఊరంతా వ్యాపించింది. అంతా అటు వైపు పరుగెత్తుకుంటూ వెళ్ళారు.

'సరోజా, సరోజా' అని పెద్దగా ఏడుస్తూ శంకర్రావు భార్య మంటల్ని లెక్కచేయక కూతుర్ని రక్షించుకోవడానికి కాలిపోతూన్న ఇంట్లోకి దూసుకెళ్ళుతూంటే, లోపలి కెళ్ళిన మనిషి మళ్ళీ తిరిగి ప్రాణాలతో బయట పడడం జరగదని అంతా ఆమెను బలవంతంగా పట్టుకుని ఆపారు. మంటల్లోంచి 'అమ్మా, అమ్మా' అని సరోజ అల్లాడుతూ ఎంతో దీనంగా పిలిచిన పిలుపులు అందర్నీ దుఃఖ సముద్రంలో ముంచాయి. అందరితోపాటు అంతా చూస్తున్న కసాయి కిష్టయ్య కర్కశ హృదయం కూడా ద్రవించి పోయింది. కిష్టయ్య రెప్పపాటులో మంటల్లోంచి లోపలికి దూకాడు. మరుక్షణం అప్పటికే సగం కాలిపోయిన సరోజని బుజాన్నేసుకుని బయటి కొచ్చాడు.

ఆ పరిసర ప్రాంతాల్లో పర్యటిస్తున్న రైల్వే జనరల్ మానేజరు ఈ భయానకమైన వార్తలన్నీ తెలిసిన వాడై మటునాడు మధ్యాహ్నం అక్కడకు చేరుకున్నాడు. దగ్ధమై మొండిగా నిలిచిన స్టేషను గోడలు ఆయనకు ఆహ్వానం పలికాయి.

సరోజకు ఇంకా స్పృహ రాలేదు. ఒళ్ళంతా బాగా కాలిపోయింది. కొంచెసేపటికి కళ్ళు తెరిచి చూసింది. తన వైపే ఏదో ఆశగా చూస్తూన్న తల్లి తండ్రులు ఎదురుగా కనిపించారు. తాను చదివే కాన్వెంటు పిల్లలంతా ఆ పక్కవే గుంపులుగా నిలబడి ఉన్నారు. కాన్వెంటు నుంచి వచ్చిన సిస్టర్లంతా సరోజని బ్రతికించమని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లుగా కళ్ళు మూసుకుని ధ్యానంలో ఉన్నారు. పాపం! ఆ పసిబిడ్డ పడుతున్న బాధ ఏదో అందరితోనూ తన కళ్ళతోనే చెప్పుకుంది. చివరకు ఒక చిరునవ్వుతో సిస్టర్సందర్నీ తనకు దగ్గరగా రప్పించుకుంది.

"సిస్టర్స్! నేనేమైనా తప్పులు చేసి ఉంటే నన్ను క్షమిస్తారు కదూ?"

"... ..."

"సిస్టర్స్! నా తల్లిదండ్రుల్ని కాపాడమని దేవుణ్ణి అడుగుతారు కదూ?"

"... ..."

"సిస్టర్స్! మా ఇల్లూ, మా స్టేషనూ తగలెట్టిన వాళ్ళని దేవుడు తప్పకుండా శిక్షిస్తాడు కదూ?" అంటూ చేతులు పైకెత్తి అందరికీ దణ్ణం పెడుతూ సరోజ కన్ను మూసింది.

అక్కడ ఉండి ఇదంతా చూసిన జనరల్ మానేజరు, కన్నీటిని చేతి గుడ్డతో అద్దుకుంటూ, "తప్పకుండా శిక్షిస్తాడమ్మా — తప్పకుండా శిక్షిస్తాడు" అంటూ వెళ్ళిపోయాడు.

అంతే. అప్పటికీ, ఇప్పటికీ మళ్ళీ ఆ ఊరి స్టేషను కట్టడానికి ప్రయత్నాలేమీ జరగలేదు. ఇప్పుడు ఆ ఊరికి స్టేషను లేదు. రైలు లేదు. *

